కంట్రోల్ అయ్యేనా?





భూపాలపల్లి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చేసింది. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. ఈ నేపథ్యంలో వైద్యా ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లాలో వ్యాధులు విజృంభించకుండా చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణకు సిద్ధమైంది. అయితే.. ప్రతి ఏటా అప్రమత్తంగానే ఉన్నామని అధికారులు చెబుతున్నా వ్యాధుల నిర్మూలన సాధ్యం కావడం లేదు. దోమలు, నీటి సంబంధిత కారణాలతో వ్యాపించే వ్యాధులు ప్రతి సీజన్‌లోనూ వ్యాపిస్తూనే ఉన్నాయి. మలేరియా, డయేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర రుగ్మతలకు ప్రజలు గురవుతూనే ఉన్నారు. వర్షాల కారణంగా జిల్లాలోని తాగునీటి వనరులన్నీ వరదనీటితో కలుషితమయ్యే అవకాశాలున్న దృష్ట్యా ప్రజానీకం అంటువ్యాధులు ప్రబలుతూనే ఉన్నాయి.

అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా అధికారులు రంగంలోకి దిగారు. ముఖ్యంగా మారుమూల అటవీ ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఈ క్రమంలోనే పక్షం రోజుల క్రితం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం జరిగిం ది. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి, అంట వ్యాధుల ప్రబల కుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేకుండా జిల్లా అధికారులకు సూచిం చారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలతోపాటు పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్న పారిశుధ్య నిర్వహణపై దృష్టి పెట్టాలని పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని నిర్ణయించారు.

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- అప్రమత్తంగానే ఉన్నామంటున్న అధికారులు
- వరదలతో నీరు కలుషితం కావడంతో వ్యాపిస్తున్న రోగాలు
- ప్రతి ఏటా నమోదవుతున్న మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా కేసులు

అధికారుల ముందస్తు చర్యలు

జిల్లాలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు పొంచి ఉన్న నేపథ్యంలో వాటిని కట్టడి చేసేందుకు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వ కారణంగా వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉండగా పారిశుధ్య నిర్వహణ విషయంలో జాగ్రత్తగా ఉండాలని ప్రభుత్వం అప్రమత్తం చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు కార్యాచరణపై దృష్టి పెట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా భూపాలపల్లి జిల్లాలోని 98 ఆరోగ్య ఉప కేంద్రాలు, 13 పాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వేలు నిర్వహిస్తున్నారు. గత ఏడాది జిల్లాలో 80కి పైగా డెంగీ, 14 మలేరియా కేసులు వెలుగుచూడ్డంతో ఈసారి అలాంటి పరిస్థితులు పునారావృతం కాకుండా చర్యలు ప్రారంభించారు.

నియంత్రణ సాధ్యమేనా?

జిల్లాలో అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నామని అధికారులు చెబుతున్నా ప్రతి ఏటా అవి ప్రజలను ఇబ్బంది పెడుతూనే ఉన్నాయి. ప్రతి వర్షాకాలంలో మలేరియా, డెంగీ, డయేరియా, వైరల్ ఫీవర్, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలడం సర్వసాధారణమైంది. ముఖ్యంగా కనుమరుగైపోయిందని భావించిన మలేరియా భూపాలపల్లి జిల్లాలో తిరిగి విజృంభిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే భూపాలపల్లి జిల్లాను మలేరియా సమస్యాత్మక ప్రాంతాల జాబితాలో చేర్చి నియంత్రణ చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో అప్రమత్తంగానే ఉన్నామని జిల్లా అధికారులు చెబుతున్నా ఈఏడాది సీజనల్ వ్యాధుల నియంత్రణ సాధ్యమేనా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో వైద్య సిబ్బంది కొరత ఉంది. నలుగురు మెడికల్ ఆఫీసర్లు, 12 పల్లె దవాఖానాల డాక్టర్ల పోస్టులు జిల్లాలో ఖాళీగా ఉన్నాయి. వాటిని భర్తీ చేసి, మందుల కొరత లేకుండా చూడ్డం, వైద్య సిబ్బందిని మారుమూల ప్రాంతాలకు పంపి ప్రజలకు కావాల్సిన చికిత్సను సకాలంలో అందిస్తేనే సీజనల్ వ్యాధులను అరికొట్టొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా ఉండటం, వర్షాకాలంలో మరింత ఇబ్బందికరంగా మారుతుండటంతో ఆరోగ్య కార్యకర్తలు గ్రామీణ ప్రాంతాలకు చేరి సకాలంలో వైద్య సేవలు అందించగలుగుతారా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

అప్రమత్తంగానే ఉన్నాం..

- డాక్టర్ మధుసూదన్, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి



వర్షాలు, వరదల కారణంగా సీజనల్ వ్యాధులు విజృంభించే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో మా శాఖ అప్రమత్తంగానే ఉంది. వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నాం. ఇప్పటికే సిబ్బంది ద్వారా సమస్యాత్మక గ్రామాల్లో ప్రజల కు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం. అలాగే అవసరమైన మందులన్నీ అందుబాటులో ఉంచుతున్నాం. దీంతోపాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలను వేగంగా చేపట్టేందుకు సంబంధిత శాఖతో కలిసి పనిచేస్తున్నాం.

వరదలతో నష్టం వాటిల్లొద్దు

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, జూన్ 18: వర్షాకాలం దృష్ట్యా అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వరదల వల్ల నష్టం వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. వర్షాలు, వరదలు, సీజనల్ వ్యాధులు తదిదర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో గోదావరితోపాటు నలువైపులా వాగులు ఉండటంతో వరదలు సంభవించే ప్రమాదం ఉంటుందని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. మూడేళ్లుగా వర్షాపాతం ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలను గుర్తించి నివేదిక అందించాలన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసి వరదలు వచ్చినప్పుడు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కుంటల మత్తళ్ల వద్ద ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ముంపు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. వరదల సమయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గర్భిణులు, అత్యవసర చికిత్స పొందుతున్న రోగులను గుర్తించి ముందస్తుగా ఆస్పత్రులకు తరలించాలన్నారు, గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను, వంగిన విద్యుత్ స్తంభాలను పంచాయతీ కార్యదర్శులు తొలగించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగిలాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో కొత్తగా 12 కో ఆపరేటివ్ బ్యాంకులు

- ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపాం
- రుణమాఫీతో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం
- హామీనిచ్చి నెరవేర్చడం సీఎం రేవంత్‌కే సాధ్యం
- డీసీసీ బ్యాంక్ మేనేజింగ్ కమిటీ భేటీలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని



మేనేజింగ్ కమిటీ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 18 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొత్తగా 12కో ఆపరేటివ్ బ్యాంకుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, రాష్ట్రంలో ప్రతీ రైతుకు డీసీసీబీల ద్వారా ప్రయోజనం పొందేలా ప్రభుత్వ సహకారంతో ముందుకు వెళతానని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన డీసీసీ బ్యాంక్ మేనేజింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కోపరేటివ్ బ్యాంకుల్లో రుణం తీసుకున్న రైతులకు రుణమాఫీకి టెస్కాబ్ నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. టెస్కాబ్ పరిధిలో 33లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారని, అయితే వీరిలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.2లక్షల వరకు రుణం తీసుకున్న సుమారు 7.75లక్షల మందికి రూ.4,786కోట్లు మాఫీ ద్వారా ప్రయోజనం కలగనుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో రైతులకు లక్ష రుపాయల రుణమాఫీ చేయలేకపోయిందని విమర్శించారు. హామీ ఇచ్చి నెరవేర్చడం.. రైతు పక్షపాతిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డికే సాధ్యమవుతుందన్నారు. ఎంతో నమ్మకంతో తనను టెస్కాబ్ చైర్మన్‌గా నియమించిన రేవంత్‌రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు సేవ చేస్తానని రవీందర్‌రావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ములుగు కలెక్టర్ దివాకర



కొండాయిలో గ్రామస్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర్

ఏటూరునాగారం రూరల్, జూన్ 18 : వానాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ టి.ఎస్.దివాకర అన్నారు. మండలంలోని కొండాయి గ్రామంలో ఆయన మంగళవారం పర్యటించారు. గత ఏడాది సంభవించిన వరదలు, జరిగిన నష్టం తదితర అంశాలపై ఆరా తీశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కలెక్టర్‌తో మాట్లాడుతూ వర్షాకాలంలో గ్రామంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతుంటాయని, మళ్లీ అలాంటి పరిస్థితులు ఎదురుకాకుండా ముంస్తు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై కలెక్టర్ మాటాడుతూ వరదలతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపడుతుందని అన్నారు. జిల్లా యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కోరారు. అదేవిధంగా జంపన్నవాగు, గోదావరి నది ముంపు గ్రామాల పట్ల ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అధైర్యపడొద్దని అన్నారు. వరద సమయంలో జిల్లా యంత్రాంగం సూచనలు, సలహాలను ప్రజలు పాటించాలన్నారు. అనంతరం కొండాయి వద్ద జంపన్నవాగుపై నిర్మిస్తున్న తాత్కాలిక బ్రిడ్జి పనులను కలెక్టర్ పరిశీలిచారరు. బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అలాగే కొండాయి, దొడ్ల, కొత్తూరు తదితర గ్రామాల్లో పలు సమస్యలపై ప్రజలు ఆయనకు వినతులు అందజేశారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి



ఐటీడీఏలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా వ్యవహరించాలి
- మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోలీసులు దృష్టిపెట్టాలి
- ప్రతీ మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలకమండలి సమావేశాలు
- పంచాయతీరాజ్, స్త్రీ శిశుసంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క

ఏటూరునాగారం రూరల్, జూన్ 18 : ఐటీడీఏ అధికారులు అంకితభావంతో పనిచేయాలని పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా అధికారులు, ఐటీడీఏ సెక్టోరియల్ అధికారులతో మంత్రి మంగళవారం సమావేశమయ్యారు. మొదటగా ఐటీడీఏ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నీటి పారుదల, రెవెన్యూ, పోలీసు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. వానాకాలంలో చేపట్టాల్సిన కార్యాచరణ, అభివృద్ధి పనులు, సాగునీరు, వరదలు తదితర ప్రణాళికలపై సమీక్షించారు. ఏజెన్సీలో పనిచేయడాన్ని అధికారులు అదృష్టంగా భావించాలన్నారు. పనిచేసే అధికారులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ప్రజల్లో ఉంటూ సేవ చేయాలని గానీ.. పైరవీలకు తావివ్వొద్దన్నారు. ఏజెన్సీలో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు ఉంటుందని, విధుల పట్ల శ్రద్ధలేని వారు వేరే ప్రాంతాలకు స్వచ్ఛందంగా వెళ్లొచ్చని అన్నారు. అలాగే జిల్లాను అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు అధికారులు విశేషంగా కృషి చేయాలన్నారు. నేరాలకు కారకమైన డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పోలీసు యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి రవాణాపై నిఘాతోపాటు వాటి వల్ల కలిగే అవరోధాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నేర ప్రవృత్తి ఉన్నవారిపై ప్రత్యేక నిఘా పెట్టి వారి కదలికలను ఎప్పటికప్పుడు పసిగట్టాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా వైద్యాధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. గ్రామాల్లో నిత్యం పర్యటిస్తూ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను అలర్ట్ చే యాలన్నారు.

అటవీ శాఖ అధికారులు సంయమ నం పాటించాలని మంత్రి సీతక్క అన్నారు. పట్టాలిచ్చిన భూముల మధ్య వివాదాలు లేకుండా చూసుకో వాల న్నారు. ఉద్యాన సాగును ప్రోత్సహించాలన్నారు. గిరిజన భూముల్లో పండ్లతోటలు, కూరగాయాల సాగును చేపట్టేలా ఐటీడీఏ అధికారులు చొరవ చూపాలన్నారు. త్వరలోనే ఐటీడీఏ పాలక మండలి సమావేశాలను నిర్వహిస్తామని, ప్రతి మూడు నెలలకోసారి దీన్ని కొన సాగిస్తామని అన్నారు. అలాగే జిల్లా యంత్రాంగం నెల లో రెండు సార్లు అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలని కలెక్టర్, పీవోలకు మంత్రి సూచించారు. ఏజెన్సీ ప్రజల సమస్యలను తీర్చే వారధిగా ఐటీడీఏ ఉందన్నారు. ఐటీడీఏకు పేరు తీసుకొచ్చేలా అధికారుల పనితీరు ఉండాలని మంత్రి తెలిపారు. ఏజెన్సీలో జరిగే పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిని ఉపేక్షించొద్దని అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుకూలంగా పనులుండాలన్నారు. పార్టీలు, కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఉండొద్దని అన్నారు. ఏజెన్సీలో చేపడుతున్న అభివృద్ధి పనుల నాణ్యతపై కలెక్టర్, పీవో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ టి.ఎస్.దివాకర్, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌యాదవ్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఏఎస్పీ మహేష్ గితే, ఏపీవో వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్.. ట్రబుల్

- బీఆర్ఎస్ హయాంలో ఇళ్ల నిర్మాణం
- పాత వాటి విషయంలో గందరగోళం
- కొత్త వాటికి సంబంధించి పంపిణీ కాని పట్టాలు
- అద్దెకు కొన్ని.. అమ్ముకున్నవి కొన్ని ఉన్నాయనే ఆరోపణలు
- ఆందోళన బాట పడుతున్న లబ్ధిదారులు
- భూపాలపల్లిలో రోజురోజుకు జటిలమవుతున్న సమస్య



డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

వివరాలు 7వ పేజీలో..

దివ్యాంగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి

వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ చైర్మన్ రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ కోర్ కమిటీ చైర్మన్ రాంబాబు

ములుగు కలెక్టరేట్, జూన్ 18: ఎన్నికలకు ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ చైర్మన్ అందె రాంబాబు డిమాండ్ చేశారు. ములుగులోని లక్ష్మీనగర్‌కాలనీలో జిల్లా అధ్యక్షుడు మంచోజు చంద్రమౌళి అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు రూ.4వేల నుంచి రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, బీడీ కార్మికులకు రూ.2వేల నుంచి రూ.4వేల పింఛన్ అందిస్తామని చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరునెలలు గడుస్తున్నా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టకపోవడం విడ్డూరమన్నారు. రాజీవ్‌గాంధీ ఫెలోషిప్, నెట్ నుంచి వికలాంగులకు మినహాయింపు ఇవ్వాలని, శారీరక వికలాంగుల రోస్టర్ 56ని 10లోపు మార్చాలని, ప్రస్తుతం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే అన్ని ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, ఎంఎస్పీ జాతీయ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జి ఐరుగు పైడి, ములుగు జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి శ్యాంబాబు, జిల్లా అధ్యక్షురాలు లావణ్య, నాయకులు నెమలి నర్సయ్య, కడారి సాంబయ్య, పోరిక నవీన్, బానోత్ భద్రయ్య, మోహన్‌రావు, మెట్టు సుజాత, కలువల భద్రయ్య, భిక్షపతినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయ దర్శన వేళల్లో మార్పు

మహదేవపూర్, జూన్ 18: మండలంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో దర్శన వేళల్లో మార్పులు చేస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1.30 నుంచి 4 గంటల వరకు విరామ సమయంగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులకు ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు దర్శనాలు, పూజలకు అనుమతిస్తామని వివరించారు.

విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, జూన్ 18: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ప్రభుత్వ విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో రూ. 1.32 కోట్లతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆయన మంగళవారం ప్రారంభించారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో యుద్ధప్రాతిపదికన

మిగతా 8వ పేజీలో...

కేసు పెట్టారన్న భయంతో గొత్తికోయ వ్యక్తి ఆత్మహత్య

ములుగు జిల్లా కన్నాయిగూడెంలో ఘటన


ఆత్మహత్య చేసుకున్న పద్దెం లక్ష్మయ్య

ఏటూరునాగారం రూరల్, 18: పోడు నరికిన కారణంగా పోలీసులు కేసు పెట్టారన్న భయంతో ఓ గొత్తికోయవాసి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలో మంగళవారం జరిగింది. కన్నాయిగూడెం ఎస్‌ఐ సురేష్ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం సమీపంలోని మల్కపల్లి గొత్తికోయగూడానికి చెందిన మడకం బోగయ్య, మడకం బండయ్య, మడవి చుక్కయ్య, పద్దెం లక్ష్మయ్య సమీప అడవుల్లో పోడు నరికేందుకు గాను బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సునారికాని లక్ష్మయ్య, జనగం సమ్మయ్య వద్ద కొంత డబ్బు తీసుకొని ఒప్పందం చేసుకున్నారు. ఆ ఒప్పందంలో భాగంగా బోగయ్య, బండయ్య, చుక్కయ్య, లక్ష్మయ్య కొంతమేర పోడు కొట్టారు. ఈ విషయం తెలుసుకున్న అటవీశాఖాధికారులు పోడు నరికివేతను అడ్డుకున్నారు. ఆ తర్వాత అటవీశాఖ అధికారులు ఆ నలుగురిపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే అటవీశాఖాధికారులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారన్న విషయం వారికి తెలవగా.. పద్దెం లక్ష్మయ్య(40) భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108లో సామాజిక ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతుడు లక్ష్మయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

కేయూ క్యాంపస్, జూన్ 18 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్వహిస్తున్న బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల పరీక్షలు జరుగుతున్నాయి. జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాలలో ఇద్దరు వ్యక్తులు ఒకరికిబదులుగా మరొకరు పరీక్షలు రాస్తుండగా తనిఖీ అధికారులు డీబార్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్‌లు మంగళవారం తెలిపారు. వారిపై నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కొనేదెట్టా? తినేదెట్టా?



రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు

- వారం రోజుల్లోనే రెట్టింపు
- వర్షాల్లేక, కోతుల బెడదతో దెబ్బతిన్న పంటలు
- ఏపీ, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతితో మరింత భారం
- కొనలేక సామాన్యులు, పేదలు విలవిల



మహబూబాబాద్ టౌన్/తొర్రూరు/మరిపెడ జూన్ 18 : కూరగాయల రేట్లు మండిపోతున్నాయి. ఇప్పటికే బియ్యం, ఇతర నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతుండగా.. కూరగాయల ధరలు కూడా రోజురోజుకు పెరుగుతుండటంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. ధరలిలా ఉంటే కొనేదెట్టా? తినేదెట్టా? అంటూ బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజులుగా మార్కెట్లలో కూరగాయల ధరలు రెట్టింపవడంతో మార్కెట్‌కు రూ.500 నోటు తీసుకువెళితే.. కనీసం వారం రోజులకు సరిపడా కూరగాయలు రాని పరిస్థితి ఉంది. ముఖ్యంగా సామాన్యులకు నిత్యం అందుబాటులో ఉండే టమాట కిలో రూ.70 పలుకుతోంది. నిన్నమొన్నటి వరకు రూ.30కి లభించిన టమాట ఇప్పుడు డబుల్ కావడంతో వినియోగదారులకు పట్టపగలే చుక్కలు కన్పిస్తున్నాయి. మృగశిరకార్తెలో ప్రవేశించి, వర్షాకాలం ప్రారంభమైనా సకాలంలో వర్షాలు కురవక పోవడం, ఎండ తీవ్రత తగ్గకపోవడం లాంటి కారణాలతో కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. మరో వైపు గ్రామాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు సాగు చేసే వారి సంఖ్య తగ్గడం, ఒక వేళ సాగు చేసినా దిగుబడి తగ్గిపోతుండం కూడా కారనాలు కనిపిస్తున్నాయి. ఎప్పుడూ స్థానికంగా దొరికే కొత్తిమీర ధర గతంలో కట్టకు రూ.50 ఉంటే ప్రస్తుతం రూ.200 నుంచి రూ.300 పలుకుతోంది. ప్రస్తుతం కొత్తిమీరను మహారాష్ట్ర నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. ఇక ఆకుకూరలదీ అదే పరిస్థితి. గతంలో బచ్చలికూర, పాలకూర, గోంగూర రూ.10కి 5కట్టలు ఇస్తే ప్రసుతం ఒక్క కట్టను రూ.5కు విక్రయిస్తున్నారు. ప్రతీ రోజూ కూరగాయలకే రూ.100ఖర్చు చేయాల్సి వస్తే తమ పరిస్థితేంటని దినసరి కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి దిగుమతి..

ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లాలో అత్యధికంగా గిరిజన రైతులు కూరగాయలు, ఆకుకూరల సాగు చేస్తుంటారు. ఈసారి కూడా గతం కంటే అత్యధిక రైతులు కూరగాయల పంట సాగుకు మొగ్గు చూపినా వాతావరణం అనుకూలించకపోవడంతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో వినియోగదారుల డిమాండ్ల కనుగుణంగా ఉత్పత్తి లేకపోవడంతో కూరగాయల మార్కెట్ వ్యాపారులు ఏపీలోని గుంటూరు, తిరుపతి, మదనపల్లి, తెలంగాణలోని బోయినపల్లి, ఒంటిమామిడి తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో రవాణాచార్జీలు ఇతరత్రా ఖర్చులతో కలిపి కూరగాయల ధరలు ఆకాశన్నంటుతున్నాయి.



మహబూబాబాద్ మార్కెట్లో కూరగాయలను విక్రయిస్తున్న మహిళ



వారం రోజుల్లో కూరగాయల ధరలు పెరిగాయిలా (కిలోకు)

రకం	నిన్నమొన్నటి వరకు	ప్రస్తుతం
టమాట	రూ.30	రూ.70
బీరకాయ	రూ.50	రూ.160
కాకరకాయ	రూ.50	రూ.100
దోసకాయ	రూ.20	రూ.50
దొండకాయ	రూ.20	రూ.60
గోరు చిక్కుడు	రూ.30	రూ.60
మిర్చి	రూ.50	రూ.100
మంచి చిక్కుడు	రూ.60	రూ.100
క్యారెట్	రూ.60	రూ.120
క్యాబేజీ	రూ.30	రూ.50
కొత్తిమీర	రూ.50	రూ.200
పుదీన	రూ.50	రూ.100

ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గాయి

మేదరమెట్ల వెంకట్రావు, కూరగాయల వ్యాపారి, మానుకోట



కూరగాయల ధరలు పెరగడంతో కొనుగోళ్లు తగ్గాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, గ్రామాలు, తండాల్లో కోతుల బెడదతో కూరగాయల పంటలు చేతికి రావడం లేదు. దీంతో దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. రవాణా చార్జీలు, ఇతరత్రా ఖర్చులతో కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. ధరలు పెరిగి కొనుగోళ్లు తగ్గడంతో పెట్టిన పెట్టుబడులు వెళ్లడం లేదు.

దళారులకే లాభం..

రావిశెట్టి శోభ, కూరగాయల వ్యాపారి, మరిపెడ బంగ్లా



కూరగాయల విక్రయంలో దళారులకే లాభం జరుగుతోంది. పొద్దస్తమానం ఎండకిఎండి, వానకితడిచి రిటైల్ వ్యాపారం చేస్తే పూటగడవడం గగనంగా మారింది. ఇవాళ టమాట బాక్స్ రూ.1600కు హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. తరుగు పోను కిలోకి రూ.100కు అమ్మినా నష్టమే వస్తుంది.

కూరగాయలు కొనే పరిస్థితి లేదు

సోమ సుమతి, మహబూబాబాద్



కూరగాయల ధరలు ఆకాశన్నంటుతుండడంతో వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితి. ఏ కూరగాయల ధరలను చూసిన కిలో ధర రూ.60కి పైగానే ఉంది. రూ.500 తీసుకుని మార్కెట్ వెళితే కనీసం వారం రోజులకు సరిపడ కూరగాయలు రావడం లేదు. కూరగాయల ధరలు విపరీతంగా పెరగడంతో సామన్య, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. సామాన్యులు కూరగాయలు కొనలేక పచ్చళ్లతో కాలం వెల్లబుచ్చుతున్నారు.

మానుకోట జిల్లాలో 120ఎకరాల్లో కూరగాయల సాగు

రాకేశ్, ఉద్యానశాఖ అధికారి, తొర్రూరు డివిజన్



మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా 120 ఎకరాల్లో రబీ సీజన్‌లో రైతులు కూరగాయల పంటలను సాగుచేస్తున్నారు. అయితే గత రెండు నెలలుగా ఉష్ణోగ్రతలు పెరిగి పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి విత్తన సమాయన రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని మొలకలు దక్కి, కొన్ని ఎండి పోయాయి. దాంతో ఈ ఏడాది ఆశించిన విధంగా కూరగాయల పంటలు దిగుబడి కాలేదు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు.

తొర్రూరు పీఏసీఎస్ సీఈవో సస్పెన్షన్

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 18 : తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం సీఈవో మురళిని విధుల నుంచి తొలగించినట్లు జిల్లా సహకార సంఘం అధికారి వెంకటేశ్వర్‌రావు మంగళవారం తెలిపారు. ఇటీవల తొర్రూరు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల విక్రయాల్లో అవకతవకలు జరిగిన నేపథ్యంలో వ్యవసాయశాఖ ఏవో కుమార్‌తో పాటు ముగ్గురు ఏఈవోలు సస్పెండ్ అయ్యారు. పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఈవో మురళిని విధుల నుంచి తొలగించడం జరిగిందన్నారు. తొర్రూరు, పెద్దవంగర పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాల విక్రయాలపై విచారణ కొనసాగుతుందని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

'విద్యుత్ పోల్' పరీక్షకు ఏర్పాట్లు

- 22న ములుగురోడ్డు ఎన్‌పీటీఐ కేంద్రంలో నిర్వహణ



స్తంభాల చుట్టూ ఏర్పాట్లు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

హనుమకొండ టౌన్, జూన్ 18 : జూనియర్ లైన్‌మెన్ నియామకంలో భాగంగా ఈ నెల 22న నిర్వహించే విద్యుత్ స్తంభం ఎక్కే పరీక్షకు ఎన్పీడీసీఎల్ అన్ని ఏర్పాట్లను చేసింది. 2018 ఫిబ్రవరి 16న టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లకు 2553 జేఎల్ఎంలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేయగా ఉమ్మడి జిల్లాలో 575 పోస్టుల కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, ఈ పోస్టుల కోసం రోస్టర్ పద్ధతిలో ఇప్పటికి వరకు 6 దశల్లో పోల్ పరీక్ష నిర్వహించగా, 22న ములుగు రోడ్డులోని నార్తర్న్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (ఎన్‌పీటీఐ) కేంద్రంలో నిర్వహించే 7వ దశ పరీక్షకు మంగళవారం ఫోర్‌మెన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. కాగా, ఈ పరీక్షకు 16 మంది అభ్యర్థులు హాజరవుతుండగా పోల్ పరీక్షను ఆపరేషన్ డైరెక్టర్ మోహన్‌రావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఎస్ఈలు వెంకటరమణ, మధుసూదనరావుతో పాటు ఎన్‌పీటీఐ డీఈ, ఇతర అధికారుల పర్యవేక్షణలో నిర్వహించి పారదర్శకత కోసం వీడియోగ్రఫీ సైతం తీయడం జరుగుతుందని వెల్లడించారు. కాగా, అభ్యర్థులు దళారులను నమ్మవద్దని, తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో ఉదయం 9 గంటలకు ములుగురోడ్డులోని ఎన్‌పీటీఐ కేంద్రంలో హాజరుకావాలని హనుమకొండ ఎస్ఈ వెంకటరమణ సూచించారు.

సివిల్ సర్వీస్ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : సివిల్ సర్వీస్-2025 సంవత్సరంలో పరీక్ష రాసే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రుద్రేశ్వరుడికి ట్రెయినీ ఐఏఎస్‌ల పూజలు



రుద్రేశ్వరాలయంలో ట్రెయినీ ఐఏఎస్ అధికారులు

హనుమకొండ కల్చరల్, జూన్ 18 : నగరంలోని ప్రసిద్ధ వేయి స్తంభాల రుద్రేశ్వరాలయాన్ని మంగళవారం సాయంత్రం పలువురు ట్రెయినీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. తొలిసారిగా నగరానికి విచ్చేసిన వారు చారిత్రక వేయిస్తంభాల ఆలయ శిల్ప సౌందర్యాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. టూరిజం అధికారి శివాజీ ఆధ్వర్యంలో మనోజ్, అజ్మీర సంకేత్ కుమార్, గరిమ నరుల అభిజ్ఞాన్ మాల్వియ, మహిళా అధికారిణి ఉమా హారతి, అజయ్ యాదవ్‌లు ఆలయాన్ని సందర్శించిన అధికారుల్లో ఉన్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన వేయిస్తంభాల కల్యాణ మండపాన్ని కూడా తిలకించారు. ఆలయ ప్రాంగణంలో అనేక ఫొటోలు దిగారు. ఆలయంలో ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ వారికి స్వాగతం పలికి రుద్రేశ్వరుడికి వారిచే మారేడుదళ బిల్వార్చణ నిర్వహింపజేసి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

డబుల్.. ట్రబుల్

- బీఆర్ఎస్ హయాంలో ఇళ్ల నిర్మాణం
- పాత వాటి విషయంలో గందరగోళం
- అద్దెకు కొన్ని.. అమ్ముకున్నవి కొన్ని ఉన్నాయనే ఆరోపణలు
- కొత్త వాటికి సంబంధించి పంపిణీ కాని పట్టాలు
- ఆందోళన బాట పడుతున్న లబ్ధిదారులు
- భూపాలపల్లిలో రోజురోజుకు జటిలమవుతున్న సమస్య



వేశాలపల్లి శివారులో నిర్మించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయాలు

భూపాలపల్లిటౌన్, జూన్ 18 : పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యమంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. కానీ పేదల సొంతింటి కల నెరవేరడేమేమో గానీ సమస్య తార స్థాయికి చేరింది. ముఖ్యంగా ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో భూపాలపల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భూపాలపల్లి జిల్లాలో రెండుదశల్లో 960 ఇళ్లను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించినా వాటిని సకాలంలో అర్హులకు అందించలేకపోయిందనే విమర్శలున్నాయి. మొదటి దశలో నిర్మించిన 544 ఇళ్లకు గాను లబ్ధిదారులందరికీ పట్టాలు ఇచ్చి ఇంటి నెంబర్లను కూడా కేటాయించారు. ప్రస్తుతం వాటిలో కేవలం 200 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. అందులో కొందరు విక్రయించినట్లు, మరికొందరు అద్దెకు ఇచ్చినట్లు కూడా ఆరోపణలున్నాయి. ఇదిలావుండగా.. రెండవసారి 416 ఇండ్లను నిర్మించగా.. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా సుమారు 393 మందికి ఇంటి నెంబర్లు అలాట్‌చేశారు కానీ పట్టాలు ఇవ్వలేదు. లబ్ధిదారుల జాబితాను తయారు చేసినా అధికారికంగా ఎలాంటి ప్రొసీడింగ్స్ ఇవ్వకపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో రెండో దశలో ఎంపికైన లబ్ధిదారులు వరుసగా ఆందోళనలు చేస్తుండటంతో సమస్య మరింత తీవ్రమవుతోంది.

ఆందోళనలకు కారణమిదే..

వేశాలపల్లి శివారు భాస్కర్‌గడ్డ సమీపంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 416 ఇళ్లను నిర్మించింది. అయితే వాటిని సకాలంలో కేటాయించకపోగా ఎవరికీ పట్టాలు ఇవ్వలేదు. పైగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావిడిగా ఇంటి నెంబర్లు తూతూ మంత్రంగా కేటాయించారు. 393 మంది లబ్ధిదారును గుర్తించి వారికి అలాట్‌మెంట్ చేసినట్లు అధికార యంత్రాంగం ప్రకటించింది. కానీ ఎటువంటి ప్రొసీడింగ్స్ ఇవ్వలేదు. ఈ క్రమంలో ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం గద్దె దిగడం , కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో లబ్ధిదారులకు ఆందోళన మొదలైంది. తమకు ఇండ్లు దక్కుతాయో లేదోననే బెంగతో ముందస్తుగా ఆందోళనకు పూనుకున్నారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి కూడా మద్దతు పలికి ఆందోళనను ఉధృతం చేశారు. మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ అక్కడికి చేరుకుని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వారికి సరైన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా వారు ఆందోళన విరమించలేదు.

రెండు దశలు.. 960 ఇళ్లు...

భూపాలపల్లి పట్టణంలో నివసిస్తున్న పేద ప్రజలకు అర్హులైన వారికి డబుల్‌బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు గాను గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దశల్లో 960 ఇళ్లను నిర్మించింది. అందులో మొదటి దశలో వేశాలపల్లి శివారులో సుమారు 5ఎకరాల భూమిలో 544 ఇండ్లను నిర్మాణం చేసింది. ఈ ఇండ్లు తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి ఉన్నప్పుడు నిర్మించారు. అనంతరం నాటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో రెండోదశలో భాస్కర్‌గడ్డ శివారులో సుమారు నాలుగెకరాల్లో 416 ఇళ్లను నిర్మాణం చేశారు.

544 ఇళ్ల విషయంలో సమస్యలే..

వేశాలపల్లి శివారులో నిర్మించిన 544 ఇళ్ల విషయంలో సమస్య తీవ్రతరమైంది. అందరికీ పట్టాలు ఇచ్చినా అక్కడ కేవలం సుమారు 200 కుటుంబాలు మాత్రమే ఉంటున్నాయి. ఇందులో సుమారు 20 మంది సింగరేణి కార్మికులు ఉన్నారని, 20మంది అద్దెకు ఉంటున్నారని, మరికొన్నింటిని ఉద్యోగస్తులు కొనుగోలు చేశారని విమర్శలు వస్తున్నాయి. అలాగే ఈ ఇళ్లకు ఉన్న తలుపులు, కిటికీలు, విద్యుత్ సామగ్రిని, పైపులను, ఇతరత్ర సామగ్రిని గుర్తు తెలియని దుండగులు ఎత్తుకువెళ్లారు. కానీ ఇళ్లు కేటాయించడంతో లబ్ధిదారులే వాటిని సొంత ఖర్చులతో బాగుచేసుకున్నారు. మరికొంత మంది వదిలేశారు. ఒక్కో ఇంటికి సుమారు రూ.50వేల నుంచి రూ.1లక్ష వరకు అయ్యిందని చెబుతున్నారు. ఇంకా కొన్ని ఇళ్లకు విద్యుత్ సౌకర్యం లేదు. తాగునీటి వసతి లేకపోవడంతో ఇటీవలే అధికారులు బోరు వేసి మోటారు బిగించారు కానీ.. 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందని, దీంతో నీటి వసతి లేకుండా పోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. పైగా అన్నింటికి ఒకే ఒక ప్రధాన రోడ్డు ఉందని, ఒకదానికి వేర్వేరుగా వేయాలని కోరుతున్నారు.

కబ్జా బారిన రెండెకరాలు..

544 ఇళ్లు నిర్మించిన ప్రాంతంలో సుమారు ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. కానీ అందులో రెండు ఎకరాల భూమిని ఆట స్థలానికి, పార్కు కోసం కేటాయించారు. కానీ ఆ రెండు ఎకరాల భూమిని కొందరు వ్యక్తులు తమ అధికారాలను అడ్డంపెట్టుకుని కబ్జా చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపించారు.

గత ప్రభుత్వం గందరగోళాన్ని సృష్టించింది

గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే



గత ప్రభుత్వం పేద ప్రజల్లో గందరగోళాన్ని సృష్టించింది. సక్రమంగా డబుల్‌బెడ్ రూం ఇళ్లు కేటాయించలేదు. అర్హులకంటే.. అనర్హులు ఎక్కువగా ఉన్నారనే సమాచారం ఉంది. కొన్నింటికి ఇంకా పట్టాలు కూడా ఇవ్వలేదు. అయితే వాటన్నింటిని పరిశీలించి అర్హులైన నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించి న్యాయం చేస్తాం. మరో 15 రోజుల్లో ప్రక్రియ ప్రారంభిస్తాం.

ఉద్యోగాలు ఇప్పిస్తామని ముఠా మోసం?

మట్టెవాడ, జూన్ 18: ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి, డబ్బులు వసూలు చేసి, అటు ఉద్యోగం ఇప్పించక, ఇటు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు మంగళవారం పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. బాధితుల కథనం ప్రకారం వరంగల్ మామునూరుకు చెందిన వ్యక్తితోపాటు హనుమకొండలో నివాసం ఉంటున్న మరో నలుగురు ఒక ముఠాగా ఏర్పడి ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద నుంచి మూడు నుంచి నాలుగు లక్షల రూపాయలు వసూలు చేశారు. నెలలు గడిచినా ఉద్యోగాలు ఇప్పించకపోవడం, తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయినట్టు బాధితులు భావించారు. వరంగల్ జిల్లాతోపాటు నిర్మల్ జిల్లా భైంసా, హనుమకొండ ఇతర జిల్లాల నిరుద్యోగుల నుంచి పెద్ద మొత్తంలో ఈ ముఠా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని సమాచారం. మంగళవారం బాధితులు మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 18 : తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూపు-2 పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ విద్యార్థులకు బీసీ స్టసడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 040-24071178 నెంబర్‌లో సంప్రదించాలని డైరెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఏటూరునాగారం బస్‌డిపో ఏర్పాటుకు కృషి

రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

ఏటూరునాగారం, జూన్ 18: ఏటూరునాగారంలో బస్‌డిపో ఏర్పాటుకు కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ములుగు లో మోడల్ బస్‌డిపో ఏర్పాటు చేస్తామన్నారు. ఏటూరునాగారం నుంచి మంగపేట మండల నర్సింహసాగర్ గ్రామానికి మంగళవారం బస్ సర్వీసును మంత్రి ప్రారంభించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఈ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ బాబాసాహెబ్, వరంగల్- 2 ఆర్టీసీ డిపో మేనేజర్ జి. సురేష్‌తో పాటు ఇతర శాఖల అధికారులతో కలిసి మంత్రి బస్సు సర్వీసును ప్రారంభించారు. ఏటూరునాగారంలో బస్ డిపో, ములుగులో మోడల్ బస్‌డిపో ఏర్పాటు కోసం రూపొందించాల్సిన ప్రణాళికలను ఆర్టీసీ అధికారులకు మంత్రి సూచించారు. తెలంగాణ ప్రజల సౌకర్యార్థం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ అధికారులు కృషి చేయాలని అన్నారు. ఈ బస్సు హనుమకొండ నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయల్దేరి ములుగు, ఏటూరునాగారం, మంగపేట మీదుగా నుంచి నర్సింహసాగర్‌కు రాత్రి 9.50 గంటలకు చేరుకుంటుదన్నారు. తిరిగి మరుసటి రోజు నర్సింహసాగర్ నుంచి ఉదయం 6.30 గంటలకు ప్రారంభమై హనుమకొండకు 11.05 గంటలకు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు అదనంగా ఏర్పాటు చేసిన నూతన బస్సులను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిని చిత్రా మిశ్రా, ఆర్టీసీ ఎపీపీ కుమార్, వరంగల్-2 డిపో ట్రాఫిక్ సూపరిటెండెంట్ సత్తయ్య, శంకర్, కంట్రోలర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు ఎమ్డీ. అఫ్సర్, నాయకులు వంగపండ్ల రవి, ఎమ్డీ. ఖలీల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని మంత్రికి వినతి

వెంకటాపురం(నూగూరు): మండలంలోని కొమురంభీం కాలనీ ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ నాయకులు మంగళవారం ములుగులో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కకు వినతిపత్రం అందజేశారు.

ఈసందర్భంగా నాయకులు పూనెం సాయి, ప్రతాప్‌లు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బెస్తగూడెం గ్రామంలో కొమురంభీం కాలనీ ఆదివాసీలు భూమిని సాగుచేసుకుం టున్నారని, వారికి హక్కుపత్రాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆదివాసీలకు హక్కుపత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.



ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న సీతక్క

హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్

మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు మాలతి

భూపాలపల్లిటౌన్, జూన్ 18: ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని ఆ పార్టీ మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కడారి మాలతి అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆమె మాట్లాడారు. బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలు ఖండనీయమన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో న్యాయబద్ధంగా జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నాడు అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకే న్యాయం జరిగేలా కృషి చేస్తుందని స్పష్టం చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు వావిళ్ల కోమల, జాటోతు పద్మ భట్టు శ్రీలత, పుష్ప, పరమేశ్వరి, పద్మ, శారద, మంగ, సారక్క, రేణుక, రజిత తదితరులు పాల్గొన్నారు.

గొత్తికోయగూడాల్లో ఫీవర్ సర్వే

గోవిందరావుపేట, జూన్ 18: మండలంలోని జారుడుబండ, మామిడితోట, కన్నయ్యగూడెం, మచ్చాపూర్ గొత్తికోయగూడాల్లో మంగళవారం డాక్టర్ చంద్రకాంత్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గొత్తికోయగూడాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ ఆదివాసీల నుంచి మలేరియా రక్తనమూనాలు సేకరించారు. అనంతరం డాక్టర్ చంద్రకాంత్ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంలో పరిశుభ్రత పాటించాలని, ఇళ్ల చుట్టుపక్కల మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమతెరలు వాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూవో భూపాల్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్‌లు జంపయ్య, కృష్ణయ్య శ్రీనివాస్, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, ఆశాలు సరోజన, వనిత, సమత, స్వరూప, భారతి, మంజుల, సరిత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని బాధిత కుటుంబం నిరసన

టేకుమట్ల, జూన్ 18: తమకు రావాల్సిన డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని ఆరెపల్లికి చెందిన ఇటుకాల రాయమల్లు, కుటుంబ సభ్యులు మంగళవారం మండల కేంద్రంలో నిరసనకు తెలిపారు. బాధితుడు రాయమల్లు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవరెడ్డిపేట శివారులో మొత్తం 0.39 గుంటల వ్యవసాయ భూమి తనకు ఉన్నట్లు తెలిపారు. అనారోగ్యం కారణంగా ఆ భూమిని అమ్ముకోవాలని నిర్ణయించుకున్నానని చెప్పాడు. ఈ క్రమంలో తమ గ్రామానికి చెందిన గజ్జి రమేష్ తన అన్నయ్యకు భూమి ఇవ్వమని చెప్పాడని, ఎక్కువ రేటు ఇప్పిస్తానని చెప్పాడని తెలిపాు. రమేష్ మాటలు నమ్మి అతని అన్న గజ్జి కృష్ణాకు ఎకరానికి రూ.13,65,000 ధర నిర్ణయించుకొని అమ్మకానికి ఒప్పుకున్నాట్లు తెలిపారు. కాగా రమేష్ మొదట అడ్వాన్స్ కింద రూ.50 వేలు ఇచ్చాడని, మరుసటి రోజు రూ. లక్ష ఇచ్చి పెద్ద మనుషుల సమక్షంలో కాగితం రాసి ఇచ్చాడని వివరించాడు. కాగా మరుసటి రోజే రమేష్ తాను ఇచ్చిన డబ్బుల నుంచి రూ.50 వేలు అవసర నిమిత్తం తీసుకొని ఇవ్వలేదని ఆరోపించాడు.

ఆ తర్వాత కొన్ని రోజులకు రూ.6 లక్షలు ఇచ్చి మిగలిన డబ్బులు త్వరలోనే ఇస్తామని చెప్పి గత ఏడాది జూలై 7న రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపాడు. రిజిస్ట్రేషన్ చేసుకుని సంవత్సరం పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వడం లేదని, తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. తన కుటుంబ సభ్యులతో కలిసి రాజమల్లు మండల కేంద్రంలో పురుగుల మందు డబ్బాతో ఆందోళనకు దిగాడు. పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

(5వ పేజీ తరువాయి)

పనులు చేపట్టినట్ల తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభం రోజే ప్రభుత్వ పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు, నోట్‌బుక్కులు విద్యార్థులకు అందించామన్నారు. అనంతరం మండలంలోని నవాబ్‌పేటలో ఎల్లమ్మతల్లి బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మొయినొద్దీన్, ఎంఈవో రవి, హెడ్‌మాస్టర్ సుమలత, ఎంపీటీసీలు పద్మ, అనిల్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, మధువంశీకృష్ణ, రాజకొమురు తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్ టెస్టులో 23మంది ఉత్తీర్ణులు

కాకతీయఖని, జూన్ 18: సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్ ప్రొఫెషియెన్సీ టెస్ట్‌లో 23 మంది ఉద్యోగులు ఉత్తీర్ణత సాధించినట్లు ఏరియా జనరల్ మేనేజర్ హబీబ్ హుస్సేన్ తెలిపారు. భూపాలపల్లిలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించిన ఈపీ ఆపరేటర్ ప్రొఫీషియెన్సీ టెస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భూపాలపల్లి ఏరియాలో 171 మంది ఉద్యోగులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. మొదటి రోజు 83 మందికి పరీక్ష నిర్వహించగా 8 మంది గైర్హాజరయ్యారని, 75 మంది హాజరయ్యారని అన్నారు. వీరిలో 23 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు కవీంద్ర, జ్యోతి, తుకారాం, రాజగోపాల్, గుండు రాజు యాదవ్, శ్యామ్‌ప్రసాద్, సా. దన్, సందీప్, సాయికృష్ణ యాదవ్, శ్రావణ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆ ఆరోపణలన్నీ అవాస్తవాలే..

ప్రైవేటు సెక్యూరిటీ సంస్థ ప్రొప్రైటర్ సతీష్

కాకతీయఖని, జూన్ 18: తమ సెక్యూరిటీ సంస్థపై ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి రమేష్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ సంస్థ ప్రొప్రైటర్ సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దమ్ముంటే ఆ రోపణలను నిరూపించాలని సవాల్ విసిరారు. గతంలో మున్సిపాలిటీలో సెక్యూరిటీ గార్డ్సును పెట్టి పనిచేసినప్పుడు తమపై ఆరోపణలు వస్తే కమిటీ వేసి విచారణ చేపట్టి ఆర్డర్ కాపీ ఇచ్చారని తెలిపారు. అలాగే ఆర్జీ-2లో తమ సంస్థపై విజిలెన్స్ విచారణ జరిగిందని పేర్కొన్నారు. నిజాయితీ గల సంస్థ కాబట్టే సింగరేణి కాంట్రాక్ట్ ఇచ్చిందని తెలిపారు. తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్న వారి బాగోతాన్ని రానున్న రోజుల్లో ఆధారాలతో బయటపెడతామని హెచ్చరించారు.

రోడ్డును బాగు చేసుకున్న రైతులు

మల్హర్, జూన్ 18: మండలంలోని కిషన్‌రావుపల్లికి చెందిన రైతులు గ్రామం నుంచి పొలాలు, చేన్ల వద్దకు వెళ్లే సుమారు మూడు కిలో మీటర్ల రోడ్డును స్వయంగా మంగళవారం బాగు చేయించుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుమార్లు తెలిపినా లాభం లేక పోవడంతో తమ సొంత ఖర్చుతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. వర్షాలు పడితే నడవలేని పరిస్థితి ఉంటున్న దృష్ట్యా రోడ్డును తామే బాగుచేయించుకున్నామని తెలిపారు. గత ఏడాది బురదలో ట్రాక్టర్లు దిగబడితే యంత్రాల సాయంతో బయటకు లాగినట్లు రైతులు తెలుపుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని మెటల్ రోడ్డు వేయాలని కోరుతున్నారు.

ఆపద సమయాల్లోనే ‘డయల్ 100’ను ఆశ్రయించాలి

● భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 18: ప్రజలు అత్యవసర, ఆపద సమయాల్లోనే పోలీసుల సహాయం కోరేందుకు ‘డయల్ 100’కు కాల్ చేయాలని భూపాలపల్లి సీఐ డి.నరేశ్‌కుమార్ అన్నారు. అనవసరమైన విషయాల్లో కాల్ చేసి పోలీసుల విలువైన సమయాన్ని వృథా చేయొద్దని కోరారు. తమ కుమారుడు స్కూల్‌కు వెళ్లడం లేదని ఓ తండ్రి 100 నంబరుకు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడనే కథనం ‘ఆంధ్రజ్యోతి’లో మంగళవారం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ ‘డయల్ 100’ నిరంతరంగా పనిచేస్తుందని, దానిని ఆపద సమయాల్లోనే సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. ఎప్పుడు కాల్ చేసినా పోలీసులు అప్పటికప్పుడు స్పందించి బాధితులకు అండగా నిలుస్తారని తెలిపారు. అయితే.. పోలీసులు పరిష్కరించగలిగే సమస్యలపై మాత్రమే ఫిర్యాదు చేయాలన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే అది పోలీసు శాఖ ద్వారా అవుతుందో లేదో ఆలోచించుకోవాలన్నారు. అలాకుండా పోలీసుల పరిధిలో రాని సమస్యపై డయల్ 100కు కాల్ చేసి సమయాన్ని వృథా చేయడం సమంజసం కాదన్నారు. ఇలా చేయడం వల్ల నిజంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో సహాయం అందించే అవకాశం పోలీసులకు ఉండదన్నారు. అలాగే, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఇలాంటి మోసాలకు గురైతే పోలీస్‌శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు వెంటనే ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. అలా చేయడం వల్ల డబ్బులు వెళ్లిన అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి తిరిగి రికవరీ చేసేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఆలస్యం చేస్తే పోగొట్టుకున్న డబ్బులు తిరిగి రావడంలో కాస్త ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవోస్ నాయకులు

ములుగు కలెక్టరేట్, జూన్ 18: ములుగు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన టి.ఎస్.దివాకరను టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలు రాజు ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు కలెక్టర్‌కు పూలబొకే అంద జేసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా జిల్లాలో నెలకొన్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి మేడి చైతన్య, కోశాధికారి భూక్య లాల్‌నాయక్, వైస్ ప్రెసిడెంట్లు ఎ.కుమారస్వామి, గడ్డం రమాదేవి, సహాయ కార్యదర్శి సరిత, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎనగందుల సునీత, ఉద్యోగులు రాంగోపాల్, అనిల్‌కుమార్, యశ్వంత్‌కుమార్, శ్రీనివాస్‌స్వామి, వర్ష, భవిత పాల్గొన్నారు.



కలెక్టర్‌ను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నేతలు

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

జిల్లాలోని అధికారులు బాధ్యతాయుతంగా, సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టర్ దివాకర అన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీతో కలిసి పాల్గొన్నారు. పభుత్వ ఉద్యోగులపై ప్రజలు ఎంతో నమ్మకం పెట్టుకుంటారని, ఆ నమ్మకాన్ని కోల్పోకుండా విధులు నిర్వర్తించానిడ అన్నారు. జిల్లా అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని అన్నారు. విధి నిర్వహణలో సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, డీఆర్‌డీవో శ్రీనివాస్ కుమార్, డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, విద్యాశాఖ అధికారి పాణిని, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనిన, మైనారిటీ అధికారి ప్రేమలత, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, సివిల్ సప్లయ్ మేనేజర్ రాంపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టునగర్ సందర్శన

గోవిందరావుపేట: మండలంలోని ప్రాజెక్టునగర్ గ్రామాన్ని కలెక్టర్ దివాకర సందర్శించారు. ఈసందర్భంగా గ్రామస్థులతో మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగు వరద ప్రవాహ ఉధృతి పెరిగే సమయంలో ఇళ్లను విడిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని అన్నారు. జంపన్నవాగు పరీవాహక ప్రాంతంలో ఉండే గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, స్థానిక అధికారులు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రాజెక్టునగర్‌లో గత వర్షాకాలంలో వచ్చిన వరదల కారణంగా జరిగిన ప్రమాదాన్ని, వరద ఉధృతి తీరును స్థానిక గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చాలా ఇళ్లు ముంపునకు గురయ్యాయని, నూతన గృహాలు నిర్మించాలని గ్రామస్థులు కలెక్టర్‌ను కోరగా నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సృజన్‌కుమార్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే పోలీసులకు తెలపండి

ములుగు డీఎస్పీ రవీందర్

మేడారం, జూన్ 18: గొత్తికోయ ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. తాడ్వాయి మండలం నార్లాపూర్ గ్రామం పంచాయతీ పరిధిలోని తాక్కళ్లగూడెం గొత్తికోయ గుంపును ఆయన మంగళవారం సందర్శించారు. గ్రామస్థులతో మాట్లాడుతూ పిల్లలు చదువుకొని ప్రయోజకులు కావడానికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. అపరిచుతులు గ్రామంలోకి వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

వరదలపై పోలీసుల అవగాహన

గోవిందరావుపేట: మండలంలోని ప్రాజెక్టునగర్ గ్రామంలో వరదలపై పస్రా పోలీసులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలంలో గ్రామం వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉందని, గ్రామస్థులు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై కమలాకర్ సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

వెంకటాపురం(నూగూరు):గోదావరి వరదల పట్ల మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తిరుపతిరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని గోదావరి వరద ముంపు గ్రామాలైన టేకులబోరు, వెంగళరావుపేట, తుర్సవానిగూడెం గ్రామాలను ఆయన సందర్శించారు. గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. వర్షాకాల సీజన్ ప్రారంభమైనందున గోదావరి వరదలు వచ్చే అవకాశం ఉందని, వరదల సమయంలో ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ముంపు గ్రామాలకు చెందిన యువత వరదల సమయంలో ప్రజలను కాపాడేందుకు సహకరించాలని కోరారు. అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు.

నేడు డయల్ ‘యువర్ డీఎం’

కాకతీయఖని, జూన్ 18: భూపాలపల్లి ఆర్టీసీ ఆద్వర్యంలో బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి పరిధిలో ఆర్టీసీ వల్ల ఏమైనా సమస్యలు ఉంటే సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సెల్ 9959226707కు కాల్ చేసి తెలియజేయాలని సూచించారు.

రెజింగ్ కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేయాలి

వెంకటాపురం(నూగూరు), జూన్ 18: ఇసుక సొసైటీల్లో రెజింగ్ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ భూమిపుత్ర ఆదివాసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూనెం రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలోని వనరులపై ఆదివాసీలకు హక్కులు ఉన్నప్పటికీ అవి అమలుకు నోచుకోవడంలేదని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఇసుక ర్యాంప్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసుక మాఫియాను అరికట్టేందుకు రెజింగ్ కాంట్రాక్టర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు మునేశ్వర్‌రావు, నర్సింహులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన

వెంకటాపురం(నూగూరు), జూన్ 18: మండలంలోని సూరవీడు గ్రామంలో గిరిజన సంస్కృతీ సంప్రదాయాలపై కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా సంస్థ మండల కోఆర్డినేటర్ హనుమంతు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గిరిజన సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని, గ్రామాల్లో గిరిజన పండుగలు సంప్రదాయకంగా జరగడంలేదని అన్నారు. ఇందు కోసం గిరిజనులు సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కామేష్, ఉషారాణి, నరేష్, ఇందిర, గ్రామస్థులు పాల్గొన్నారు.

గురుకులంలో పారిశుధ్య నిర్వహణకు టెండర్ల ఆహ్వానం

కాటారం, జూన్ 18:మండలంలోని దామెరకుంట సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో శానిటేషన్ కాంట్రాక్ట్ సర్వీసెస్ కోసం టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ గురుకులాల డీసీవో భిక్షపతి, గురుకులం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రజిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెండర్ ఫారాలు గురుకులంలో ఈ నెల 24న మధ్యాహ్నం 2గంటల వరకు లభ్యమవుతాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలను 3గంటల లోగా సమర్పించాలని కోరారు. సీల్డ్ టెండర్లను 25వ తేదీన చిట్యాల గురుకులంలో తెరవనున్నట్లు తెలిపారు.

అడ్డంగా కొమ్మలు.. ట్రాఫిక్‌కు అంతరాయం



రహదారిపై విరిగి పడిన చెట్టు కొమ్మలను తొలగించిన సిబ్బంది

వెంకటాపురం(నూగూరు), జూన్ 18: మండల కేంద్రంలోని ఏపీజీవీబీ సమీపంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారికి అడ్డంగా మర్రిచెట్టు కొమ్మలు పడిపోవడంతో కిలో మీటరు దూరం ట్రాఫిక్ నిలిచిపోయింది. సోమవారం రాత్రి వచ్చిన గాలిదుమారానికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. దీంతో వేపచెట్టు సెంటర్ వరకు వాహన రాకపోకలు నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డుకు అడ్డంగా పడిన కొమ్మలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కాటారం, జూన్ 18: మండలంలోని గంగారం, గట్లకుంట, దామెరకుంట గ్రామాల పరిధిలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. కాటారం ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ నాగేశ్వర్‌రావు, డీటీఎఫ్ సీఐ రాజసమ్మయ్య నేతృత్వంలో అధికారులు, సిబ్బంది గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. గుడుంబా తయారీ కోసం పలు డ్రమ్ముల్లో పులియబెట్టిన 900లీటర్లకు పైగా చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. 23లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై ఆరు కేసులు నమోదు చేసి వారిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. వీరిలో ఓ మహిళ బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో బ్రీచ్ కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట ప్రవేశపెట్టనున్నట్లు సీఐ వెల్లడించారు. ఈ దాడుల్లో కాటారం ఎక్సైజ్ ఎస్సై కిష్టయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రజిత, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు రైతుల వినతి

మహదేవపూర్, జూన్ 18: మండల కేంద్రంలోని ఎర్రచెరువును చిన్న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రిజర్వాయిర్‌గా అభివృద్ధి చేసే ప్రక్రియలో తమ భూములు ముంపునకు గురవుతున్నాయని మహదేవపూర్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 473 లోని సుమారు 50 ఎకరాల భూమిని 60 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఎర్రచెరువును రిజర్వాయర్‌గా మార్చితే తమ భూములు ముంపునకు గురవుతాయని, ప్రభుత్వం పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన

మొగుళ్లపల్లి, జూన్ 18: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమం జరిగింది. నులిపురుగులు తయారవడం వల్ల చిన్నారుల్లో రక్తహీనత, ఏకాగ్రత లోపించడం, కడుపులో నొప్పి ఏర్పడతాయని, ఎదుగుదల లోపిస్తుందని అన్నారు. పిల్లలకు పరిసరాల పరిశుభ్రత, హ్యాండ్‌వాష్, మల,మూత్రాలు విసర్జించిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కునే విధానంపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యాధికారులు సంధ్య, సరళ, యాస్మిని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటస్వామి, జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం విజయపాల్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సునీత, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆయిల్‌పాం తోటల్లో వీవీల్స్ విడుదల

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 18: భూపాలపల్లి నియోజకవర్గ పరిధి చిట్యాల, మొగుళ్లపల్లి, రేగొండ మండలాల్లో గల ఆయిల్‌పాం తోటల్లో వీవీల్స్ విడుదల కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టినట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి సంజీవరావు వెల్లడించారు. రెండున్నర నుండి మూడ సంవత్సరాల వయస్సు గల ఆయిల్ ఫామ్ తోటల్లోనే వీవీల్స్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ఆయిల్ ఫామ్ 36 నెలలు నిండిన తరువాత కోత కోసం తోటల్లో ఉంచుకోవాలని, 30 నెలల వయస్సు వచ్చే మగ గెల, ఆడ గెలలను తీసివేయాలని సూచిచారు. ఈ వీవీల్స్‌ను ఉదయం పూట మాత్రమే తోటల్లో విడుదల చేసినట్లయితే పరపరాగ సంపర్కం జరిగి మంచి గెలలు తయారువుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయభాస్కర్, ఆయిల్‌ఫామ్ సువేన్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమ్‌రెడ్డి, అధికారులు సునిల్, రమేష్, రాజేశ్వర్‌రావు, తిరుపతిరావు, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.